ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 11 మే 2024



నేటితో ప్రచార ఘట్టానికి తెర

- కొద్ది గంటల్లో మూగబోనున్న మైక్‌లు
- నిలిచిపోనున్న ప్రచార రథాలు

పార్వతీపురం, మే10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారానికి కొద్ది గంటల్లో తెరపడనుంది. శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత మైక్‌లు మూగబోనున్నాయి. ప్రచార రథాలు ఆగిపోనున్నాయి. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులతో పాటు వారి అనుచరులు కూడా ఎటువంటి ప్రచారాలు నిర్వహించరాదు. అయితే జిల్లాలో కొన్ని చోట్ల అనధికార ప్రచారం ఊపందుకునే అవకాశం ఉంది. ప్రలోభాల పర్వం మొదలు కానుంది. అధికారుల కంట పడకుండా ఈ తతంగం నడపనున్నారు. అయితే దీనిపై ప్రతిపక్షాలు, కూటమి అభ్యర్థులు దృష్టి సారించాల్సి ఉంది. అధికారులు కూడా మరింత అప్రమత్తమై అధికార పార్టీ చర్యలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. పోలింగ్‌కు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండడంతో స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు.

జిల్లాలో ఇలా..

వాస్తవంగా ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల కాకముందే జిల్లాలో ఎన్నికల వేడి ప్రారంభమైంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు వారి అనుచరులు కూడా ప్రచారాలను హోరెత్తించారు. ఈ సారి ఎన్నికల నోటిఫికేషన్, పోలింగ్‌కు మధ్య చాలా సమయం ఉండడంతో అభ్యర్థులకు కలిసొచ్చింది. టీడీపీ కూటమి అభ్యర్థులుగా సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న గుమ్మిడి సంధ్యారాణి, బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, పాలకొండ జనసేన అభ్యర్థిగా బరిలో నిలిచిన నిమ్మక జయకృష్ణ ప్రచారాల జోరును పెంచారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, మేనిఫెస్టోను అందరికీ వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మెరుగైన సంక్షేమ పథకాలు పొందాలంటే.. చంద్రబాబును సీఎం చేయాల్సిన అవసరం ఉందని , సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇదే సమయంలో వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేశారు. ఓటుతో వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. మొత్తంగా ప్రణాళిక ప్రకారం కూటమి అభ్యర్థులు జిల్లాలో ప్రచారం నిర్వహించారు.

నిబంధనలు పాటించాల్సిందే..

- నేటితో ప్రచారాలు బంద్
- కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, మే10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల ప్రచారాలను శని వారం సాయంత్రం ఆరు గంటల నుంచి నిర్వహించరాదని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ర్యాలీలు, సభలు ఏర్పాటు చేయరాదన్నారు. లౌడ్ స్పీకర్లు వినియోగం నిషేధమని పేర్కొన్నారు. కల్యాణ మండ పాలు, ఫంక్షన్ హాళ్లలో విందు భోజనాలు, సమావేశాలు వంటివి ఏర్పాటు చేయరాదన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అటువంటి కార్యకలాపాలు నిర్వహించిన వారిపైనా, ఫంక్షన్ హాల్ యాజమాన్యం మీద చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరోవైపు జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్ఠం చేశామని, అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తామని చెప్పారు. 13వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు మద్యం దుకాణాలు కూడా మూసివేయాలని ఆయన ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు ఎవరూ జిల్లాలో ఉండరాదని వెల్లడించారు. లాడ్జీలు, వసతి, అతిథి గృహాలను తనిఖీ చేస్తామన్నారు. ప్రచార నిర్వహణలో భాగంగా బల్క్ ఎస్ఎంఎస్‌లు చేయడం నేరమని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ఏజెంట్లు నేరుగా పోలింగ్ కేంద్రాల్లోకి చేరుకోవచ్చని, ప్రిసైడింగ్ అధికారి నియామక పత్రాలను జారీ చేస్తారని పేర్కొన్నారు. పోలీస్ వెరిఫికేషన్ అవసరం లేదన్నారు. పోలీసు కేసులు ఉన్నప్పటికీ ఏజెంట్‌గా ఉండొచ్చని, అయితే పోలింగ్ కేంద్రాల్లో తగాదాలు సృష్టిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు..శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్‌కు ఒక్కో వాహనం వరకే అనుమతి ఉంటుం దన్నారు. ఇతరులు వాటిని వినియోగించరాదన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు మొబైల్ తీసుకెళ్లరాదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లోకి వస్తుందని కలెక్టర్ చెప్పారు. 12, 13 తేదీల్లో ప్రింట్ మీడియాలో వచ్చే ప్రకటనలకు గాను అభ్యర్థులు విధిగా ఎంసీఎంసీ ప్రీ సర్టిఫికేషన్ పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



విద్యుత్ సరఫరా లేని మోటార్లు





వ్యవసాయం మరిచి..

- సాగుకు 9 గంటల కరెంటు ఉత్తిమాటే..
- అమలుకాని జగన్ హామీ
- వ్యవసాయ యాంత్రీకరణకు మంగళం పాడిన వైనం
- వైసీపీ పాలనలో సబ్సిడీకి దూరమైన రైతన్నలు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో పథకాలు అమలు
- వాటిన్నింటినీ రద్దు చేసిన సర్కారు
- ప్రభుత్వ తీరుపై అన్నదాతల మండిపాటు

(గరుగుబిల్లి/కొమరాడ)

'మాది రైతు పక్షపాత ప్రభుత్వం.. వ్యవసాయానికి పెద్దపీట వేశాం.. అర్హులైన రైతులందరికీ సంక్షేమ పథకాలు అందించాం.' అని ఐదేళ్లుగా సీఎం జగన్ చెప్పుకొచ్చారు. కానీ ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరించారు. అధికారంలోకి రాక ముందు.. వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ పూర్తిగా మరిచారు. మాట మార్చారు.. మడమ తిప్పారు. రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందించే పథకాలకు మంగళం పాడేశారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు నిరంతరం విద్యుత్ సరఫరా హామీ కూడా గాలిలో కలిసిపోయింది. మొత్తంగా వైసీపీ సర్కారు తీరుపై జిల్లా రైతులు పెదవి విరుస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో జగన్.. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇది నమ్మి అన్నదాతలు వైసీపీకి ఓట్లు వేసి గద్దెనెక్కించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తన అసలు రూపం చూపించారు. నూతనంగా యాంత్రీకరణ పథకాలు అమలు చేయకపోగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న పథకాలన్నీ రద్దు చేశారు. ముఖ్యంగా రైతులకు వ్యక్తిగతంగా సబ్సిడీతో యంత్ర పరికరాలు సరఫరా చేయలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతు గ్రూపులతో పాటు వ్యక్తిగతంగా రైతు రథం ట్రాక్టర్లు, పలు రకాల యంత్ర పరికరాలు అందజేసేవారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే యాంత్రీకరణ పథకాన్ని అటకెక్కించింది. దీంతో జిల్లాలో రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

చేతులెత్తేశారు

అన్ని రకాల పురుగు మందులు పిచికారీ చేసేందుకు రాయితీతో డ్రోన్ యంత్రాలను పంపిణీ చేస్తామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి చేతులెత్తేసింది. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన రైతుల గ్రూపులకు 40 శాతం రాయితీ, వ్యవసాయ వృత్తి కోర్సు పూర్తి చేసిన రైతు ఉన్న గ్రూపులకు 50 శాతం రాయితీతో డ్రోన్‌లు మంజూరు చేయాలని నిర్ణయించారు. అయితే ఐదేళ్లు పూర్తయినా ఒక్క డ్రోన్ కూడా ఇవ్వలేదు. దీంతో ఆయా రైతు గ్రూపులు నిరాశకు లోనయ్యాయి. వైసీపీ అధికారం చేపట్టిన రెండేళ్ల తరువాత యంత్ర సేవ పథకం ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ)లను ఏర్పాటు చేసి ట్రాక్టర్లు, ఇతర పరికరాలు అరకొరగా పంపిణీ చేశారు. అందులోనూ స్థానిక అధికార పార్టీ నేతలు సిఫారసులు ఉన్న గ్రూపులకే పథకాన్ని వర్తింపజేసి మిగిలిన రైతులకు మొండిచేయి చూపారు. సీహెచ్‌సీ సెంటర్లకు అరకొరగా ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పరికరాలు అందజేసి రైతులను తామే ఉద్ధరించినట్లు గొప్పలు చెప్పుకున్నారు. ఇక టార్పాలిన్లు, తైవాన్ స్ప్రేయర్లు ఊసే లేదు. దీంతో బయట మార్కెట్‌లో వందలాది రూపాయలు అదనంగా చెల్లించి రైతులు వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విద్యుత్ సరఫరా ఇలా..

వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామన్న వైసీపీ ప్రభుత్వం.. దానిని అమలు ఏయడంలో విఫలమైంది. ప్రస్తుతం ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారని, అది కూడా రెండు విడతల్లో ఉదయం, సాయంత్రం ఇస్తూ ఇందులో కూడా రెండు గంటలు కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వాస్తవంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా దైవాదీనంగా మారింది. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియక పొలాల్లోనే రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. రెండు నెలల కిందట వరకు ఏడు గంటల పాటు ఒకే విడతలో సరఫరా ఇచ్చేవారు. ఆ తర్వాత క్రమంగా రెండు విడతలుగా ఉదయం, సాయంత్రం ఇవ్వడం ప్రారంభించారు. మరికొద్దిరోజులకు విద్యుత్ సరఫరా మూడు, నాలుగు గంటలకు పడిపోయింది. ప్రస్తుతం ఒక రోజు నాలుగు గంటలు, మరొక రోజు ఐదు గంటలు చొప్పున సరఫరా అవుతోంది. కొన్ని ఫీడర్లలో సక్రమంగా మూడు గంటల పాటు కూడా విద్యుత్ సరఫరా ఉండడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

- ప్రస్తుతం ఉద్యాన పంటలతో పాటు చెరకు సాగు చేస్తున్న రైతులకు సాగునీరు ఎంతో అవసరం. వరి, అరటి, సరుగుడు, పామాయిల్ తోటలు, కాయగూరల సాగు, పూల తోటలతో పాటు వేరుశనగ, పశువులకు అవసరమైన గడ్డి పెంపకానికి కూడా సాగునీరు అవసరం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండకపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఇళ్లకు కూడా అనధికార కోతలు అమలవుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోజుకు 4 గంటలు కూడా ఇవ్వడం లేదు..



వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ప్రస్తుతం నాలుగు గంటలు కూడా సరఫరా ఉండడం లేదు. దీంతో కనీసం రెండు సెంట్ల భూమి కూడా తడవడం లేదు. వేరుశనగ పంటకు సరిగా నీరందక నష్టపోయాం. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉండోం దో, ఎప్పుడు పోతుందో తెలియక ఇంటికి, పొలానికి తిరుగుతున్నాం.

-రామారావు, రావివలస, గరుగుబిల్లి మండలం

పొలాలు తడవడం లేదు..



వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా ఉండడం లేదు. కనీ సం 4 గంటల పాటు నిరంతరాయంగా సరఫరా ఉండడం లేదు. ప్రతి సారీ అంతరాయాలు, ఏదో కారణాలతోనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నారు. ఇదేమని అడిగితే పైనుంచే కట్ చేస్తున్నామని అంటున్నారు. ప్రస్తుత విద్యుత్ సరఫరాతో కనీసం ఎకరం పొలం కూడా తడవడం లేదు.

- దత్తి సోమినాయుడు, గొట్టివలస, గరుగుబిల్లి మండలం

అప్పట్లో రాయితీలతో చేయూత..



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు రకాల రాయితీ పథకాలతో రైతులకు చేయూతనిచ్చేవారు. వ్యక్తిగతంగా రైతు రథం పథకం ద్వారా సబ్సిడీతో ట్రాక్టర్లు పంపిణీ చేసేవారు. తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు, స్ప్రింక్లర్లు, యూపీవీసీ పైపులతో పాటు వ్యవసాయ పరికరాలు 40 నుంచి 50 శాతం రాయితీపై రైతులకు అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాలన్నింటినీ రద్దు చేశారు. ప్రభుత్వం ఎలాంటి పథకాలు అమలు చేయకుండా రైతులను మోసం చేసింది.

- డి.వెంకటనాయుడు, విక్రమపురం, కొమరాడ మండలం

రైతు సంఘాలకే ఇస్తున్నాం..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ యంత్రీకరణ పరికరాలకు సంబంధించి రాయితీలు ఎత్తి వేశారు. వ్యక్తిగతంగా కాకుండా రైతు సంఘాలకు మాత్రం సబ్సిడీపై పలు పరికరాలు ఇస్తున్నాం.

-ఓ వ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

ఎల్‌ఎంసీ ఆదేశాల మేరకు...

జిల్లాలోని ప్రతి మండలంలో సుమారు 1200 వ్యవసాయ మోటారు కనెక్షన్లు ఉన్నాయి. విజయనగరం ఎల్‌ఎంసీ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

-ఓ విద్యుత్ శాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

నౌగూడలో విత్తన పండగ

సీతంపేట: నౌగూడ గ్రామంలో అక్షర బ్రహ్మ ఆలయం వద్ద శుక్రవారం అక్షర తృతీయ విత్తన పండగను ఘనంగా నిర్వహించారు. 33 గ్రామాలకు చెందిన ఆదివాసీలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఏటాలానే ఈసారి కూడా అన్ని రకాలకు చెందిన విత్తనాలను సేకరించి 33 గ్రామాలకు చెందిన అక్షర బ్రహ్మ రైతులతో పూజలు చేయించారు. అనంతరం రైతులకు విత్తనాలు అందించారు. వాటిని ముందుగా పొలాల్లో వేసిన తర్వాతే మిగతా విత్తనాలు వేస్తారు. అలా చేస్తే పంటలు బాగా పండి అధికంగా దిగుబడి వస్తాయని వారి నమ్మకం. అక్షర బ్రహ్మ రైతులు కుటుంబ సమేతంగా ఆ ఆలయం వద్దే మూడు రోజుల పాటు భోజనాలు చేసి, పూజలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులు బాగా చదువుకోవాలని పూజలు నిర్వహిస్తారన్నారు. కాగా ఈ అక్షర తృతీయ విత్తన పండగ ఆదివారంతో ముగుస్తుందని చెప్పారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తం: ఎస్పీ

సాలూరు రూరల్, మే 10: జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి అంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. శుక్రవారం సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ పోలీస్ సెక్టార్ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల వాతావరణం చెడగొట్టడానికి ఎవరు ప్రయత్నించినా ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. పోలింగ్ సజావుగా జరిగేలా తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సమీక్షలో ఏఎస్పీ సునీల్ షరోన్, డీఎస్పీ, సాలూరు రూరల్, అర్బన్ సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

విజయనగరం, పార్వతీపురం మన్యం ఉమ్మడి జిల్లాల్లోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. విజయనగరం				
2. ఎస్. కోట				
3. గజపతినగరం				
4. నెల్లిమర్ల				
5. చీపురుపల్లి				
6. రాజాం				
7. బొబ్బిలి				
8. సాలూరు				
9. పార్వతీపురం				
10. కురుపాం				
11. పాలకొండ				
మొత్తం:				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : ఎచ్చెర్ల గ్రామం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా., ఆంధ్రప్రదేశ్., పిన్: 532410

పీపుల్స్ మేనిఫెస్టో

దేవాలయాల అభివృద్ధికి కార్యాచరణ ప్రకటించాలి



సాలూరు రూరల్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయాలి. దేవదాయ శాఖ పనితీరును మెరుగుపర్చాలి. దేవాలయాల నుంచి ఆదాయం తీసుకు వెళ్లడమే తప్ప వాటిని పట్టించుకోదనే అపప్రధ ఉంది. అందువల్ల జీర్ణవ్యవస్థలో ఉన్న దేవాలయాలను గుర్తించి దీపధూప నైవేద్యాలు నిత్యం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. భక్తులు అధికంగా సందర్శించే దేవాలయాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలి. దేవాలయాల భూములు కబ్జాదారుల కోరల నుంచి విడిపించాలి.

- అధికార్ల నాగరాజు, విశ్వనాథపురం

పోలింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు ఇలా..

సాలూరు రూరల్, మే 10: పోలింగ్ నిర్వహణకు వచ్చే ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్లపై అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. పోలింగ్ నిర్వహణకు ఈ నెల 12న సిబ్బంది కేంద్రాలకు చేరుకుంటారు. 13న పోలింగ్ నిర్వహించి.. సాయంత్రం వెళ్లిపోతారు. 12న సాయంత్రం పోలింగ్ స్టేషన్‌కు వచ్చే సిబ్బందికి బోండాలు, గారెలు, అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రికి చపాతి, అన్నం, ఆకుకూర పప్పు, పచ్చడి, బంగాళాదుంప కూర, రసం, పెరుగు, వడియాలు, అరటిపండు ఇవ్వాలి. పోలింగ్ రోజు 13న వేకువజామున, సాయంత్రం టీ, ఉదయం ఐదు గంటలకు వేడి ఇడ్లీ, రెండు గారెలు, రెండు చట్నీలు అందించాలి. ఉదయం 9 గంటలకు పండ్లు, మజ్జిగ లేదా కొబ్బరినీళ్లు ఇవ్వాలి. ఉదయం 11 గంటలకు ప్లమ్‌కేక్, టీ అందించాలి. మధ్యాహ్నం 12.30 గంటలకు వెజిటబుల్ బిర్యానీ, పెరుగన్నం, నిమ్మబద్ద, 3 గంటలకు బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్ సలాడ్, సాయంత్రం 6 గంటలకు బోండా, గారె, చట్నీ, మజ్జిగ లేదా టీ అందించాలి.

అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా

పెద్దల మాట



బొబ్బిలి: అప్పటి ఎన్నికలకు, ఇప్పటి ఎన్నికలకు చాలా తేడా ఉంది. నాయకుల్లోనే కాకుండా మా ఓటర్లలో కూడా నీతి నియమాలు లేకుండాపోయాయి. డబ్బులు ఇస్తే ఒకలా మాట్లాడుతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఇంకోలా మాట్లాడుతున్నారు. ఇంకొందరు అందరి దగ్గర డబ్బులు దండుకుంటున్నారు. రెండు పక్కల మాటిచ్చేస్తున్నారు. ఇది చాలా తప్పు. అందరిలోనూ మార్పు రావాలి. మంచి నాయకులు రావాలంటే ఓటర్లంతా మంచివారుగా ముందు మెలగాలి. ఎవరి దగ్గర ఎటువంటి ప్రలోభాల కోసం ఆశ పడకూడదు. ఓటును పవిత్రమైనదిగానే భావించి దానిని అమ్ముకోకుండా మంచిగానే వాడుకోవాలి. అందరూ అన్నీ ఇచ్చెయ్యాలి. మన ఇంటికి- దేశానికి మేలు జరిగిపోవాలి అంటే ఎలా కుదురుతుంది.? నేను చాలా ఎన్నికలు చూశాను. ఈ సారి ఎన్నికలు బాగా కలుషితమైపోయినట్లు కనిపిస్తున్నాయి. అందరి తలరాతను ఆ దేవుడే మార్చాలి మరి.

- మరడ లక్ష్మునాయుడు (70), దిబ్బగుడ్డివలస, రైతు



● భిన్న మార్గాల్లో ఆకర్షణ ● ఓటర్లకు వరాలు ప్రకటిస్తున్న అభ్యర్థులు

ఇవీ పాలిట్రిక్స్!

(శృంగవరపుకోట)

పార్టీల జయాపజయాలను నిర్ణయించే ఓట్ల పండగ వచ్చేస్తోంది. మరో మూడు రోజుల్లో పోలింగ్. దీంతో ఓటరును ప్రసన్నం చేసుకోనే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఓటరు దేవుడి కరుణ కోసం చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థులు ఒకరిని మించి ఒకరు ఓటరును ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తామే మెరుగైన వారిగా నమ్మించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అవేంటో ఓసారి చూద్దాం.

పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని..

ఓటర్లను ఆకట్టుకొనేందుకు పెద్ద సంఖ్యలో జనాన్ని పోగేసుకుంటున్నారు. ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి తరలిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచారానికి ఏ గ్రామానికి వెళుతున్నారో.. అక్కడికి ముందుగా తమ అనుచరులను పంపిస్తున్నారు. అక్కడ ప్రజలను పోగేసిన తర్వాత నాయకులు వెళుతున్నారు. తాము వస్తే ఊరికి ఊరు కదిలి వస్తోందన్న విధంగా ప్రచారం చేసుకుంటున్నారు.

ఓటర్లను బూతుల వద్దకు తెచ్చేలా..

ఓటర్లను పోలింగ్ బూతుల వద్దకు తీసుకొచ్చేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఇప్పటికే గ్రామ స్థాయిలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఇచ్చే డబ్బులు కాకుండా, అదనంగా కొంత మొత్తాన్ని స్థానిక నాయకులకు అందిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న ఓటర్లనే కాకుండా వలస ఓటర్లను రప్పించే బాధ్యత వీరిదే. రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా ఎన్నికయ్యేందుకు సహకరిస్తామని మాటిస్తున్నారు. ఒప్పందాలు కుదుర్చుకొని ఇతర పార్టీల్లో ఉన్న సర్పంచ్‌లను, ఆశావహులను తమ వైపు తిప్పుకుంటున్నారు.

ఉచితంగా శిక్షణ

ఉచితంగా సేవలు అందించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నాయి. కొత్తగా రాజకీయాల్లో వచ్చిన అభ్యర్థులు తమను గెలిపిస్తే యువతకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారు. తమకు తెలిసిన సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మబలుకుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో యువతకు వాలీబాల్ కిట్లు, క్రికెట్ కిట్లు అందిస్తున్నారు. అభ్యర్థి ఇచ్చినట్లు కాకుండా తమ వారి ద్వారా అవసరమైన క్రీడా పరికరాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రాయితీలు అందుకోండి

ఎన్నికల్లో ఓటర్లను తమకు అనుకూలంగా మలుచుకొనేందుకు అభ్యర్థులు రాయితీలను అందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు రాయితీలు కల్పిస్తామని తల్లిదండ్రులకు వల వేస్తున్నారు. ఇందుకు వారి దగ్గర బంధువులు, తెలిసిన విద్యాసంస్థల యజమానులతో మాట్లాడిస్తున్నారు. కొందరు విద్యాసంస్థల ప్రతినిధులు అభ్యర్థులకు అనుకూలంగా ఫీజు రాయితీ ఇస్తామంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.



నాయకుల హామీలు

పోటీలో ఉన్న అభ్యర్థులకు కొందరు నాయకులు వలంటీర్లుగా మారిపోతున్నారు. తాము మద్దతు ఇస్తున్న అభ్యర్థిని గెలిపిస్తే సమస్యలను తీర్చే బాధ్యతను తామే తీసుకుంటామని మాటిస్తున్నారు. ప్రధాన పార్టీలను గెలిపించే బాధ్యతను ఇలా తీసుకుంటున్నారు. వారి మాటలకు తలొగ్గి వారు చెప్పిన అభ్యర్థుల గెలుపునకు ఓటర్లు అంగీకరిస్తున్నారు.

ప్రచారకులుగా యువత

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమ పక్షాన పనిచేసేందుకు కొందరు యువకులను ప్రచారకులుగా నియమించుకుంటున్నారు. కొన్ని వర్గాల వారిని ఆకట్టుకోవాలంటే యువతే సరైన వారధి అని... వారితో చెప్పిస్తే మంచి ఫలితం ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గంలోనూ ప్రచార సమయంలో యువతే ఎక్కువగా కనిపిస్తున్నారు.

సంతృప్తిపరచడమే ధ్యేయం

ఓటర్లను సంతృప్తి పరిచేందుకు అభ్యర్థులు పెద్దపీట వేస్తున్నారు. ఏ ప్రాంతంలో ఏ సమస్య ఉంది? వాటిని పరిష్కరించేందుకు ఉన్న అవకాశాలు ఏంటి? తదితర అంశాలను ముందుగా తెలుసుకుంటున్నారు. ఓటర్లతో వాటిపై చర్చ పెడుతున్నారు. వాటిని పరిష్కరించేందుకు తమ వద్ద ఉన్న మార్గాలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల పట్టును తగ్గించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

అభ్యర్థుల గుణగణాలపై..

బరిలో ఉన్న అభ్యర్థుల గుణగణాలను పొగిడేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేస్తున్నారు. వారిని తీసుకొని గ్రామాలకు వెళ్తున్నారు. వారిని బంధువులు, మిత్రుల వద్ద వదులుతున్నారు. అభ్యర్థుల గురించి మంచిగా చెప్పి ఓట్లేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఇతరులకు ఓటేసినా ఇప్పుడు తమ వారికి ఓటెయ్యాలని అడుగుతున్నారు. పార్టీ అభిమానాలను పక్కన పెట్టి మంచి అభ్యర్థికి పట్టం కట్టాలని కోరుతుండడంతో పాటు ఓట్లు వేయించుకుంటున్నారు.

ఆఫర్ల మీద ఆఫర్లు..

ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటిస్తున్నారు. కుల సంఘాల వారీగా, మహిళా సంఘాల వారీగా రప్పించి ఏం కావాలో చెబితే వెంటనే చేసి పెట్టేందుకు సిద్ధమని ఆఫర్ ఇస్తున్నారు. గ్రామంలో కడుతున్న దేవాలయాలకు సాయం... బోర్లు కావాలని చెప్పగానే వెంటనే అమలు చేసేస్తున్నారు. ఇలా ఎవరు ఏదడిగినా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

వినూత్నంగా ఎన్నికలకు ఆహ్వానం

● సోషల్ మీడియాలో వైరల్

సాలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల వేళ సోషల్ మీడియాలో నెటిజనులు సృజనాత్మకతను చాటుకుంటూనే ఉన్నారు. ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరగనుంది. ఈ పోలింగ్‌కు వచ్చి ఓటు వేయాలని కోరుతూ వినూత్నంగా నెటిజనులు ఆహ్వాన పత్రికను తయారు చేశారు. ఎన్నికల తేదీ, వేదిక, విందు, ఆకాంక్ష అంటూ ఆహ్వాన పత్రిక హల్‌చల్ చేస్తోంది. ఆహ్వాన పత్రిక చివరిలో 'భవదీయులు... తలరాతను మార్చే శక్తే ఈ ఓటు' అంటూ ముగించారు.

సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఆహ్వానపత్రిక



కొత్తవలసలోనే గిరిజన విశ్వవిద్యాలయం

● విశాఖ జిల్లాలో ఎస్.కోటను కలిపేస్తాం
● కూటమి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి

(శృంగవరపుకోట)

'ఈ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీదే విజయం. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతి చోటా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వైసీపీ పాలనలో పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెడుతున్నారు. స్వయం ఉపాధి కోసం టైలరింగ్, అప్పడాల తయారీ వంటి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాను. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నియోజకవర్గంలో ఓ పరిశ్రమ స్థాపనకు ప్రయత్నిస్తాను. గిరిజన గ్రామాల డోలీ అవస్థలు తీరుస్తా'నంటున్నారు ఎస్.కోట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలితకుమారి. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...



ఎస్.కోట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి

కొత్తవలసలోనే విశ్వ విద్యాలయం

కొత్తవలసలోనే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వం ఇక్కడి నుంచి దీన్ని తరలించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి ఇక్కడ పనులు ప్రారంభిస్తాం. టీడీపీ ప్రభుత్వం కొత్తవలస మండలం రెల్లి గ్రామ పరిధిలో భూమిని అప్పగించింది. ఇది విశాఖకు ఆనుకుని ఉండడంతో కేంద్ర ప్రభుత్వం సమ్మతించింది. అందరికీ అనువైన ప్రాంతంలో నిర్మించాలనుకున్న ఈ విశ్వవిద్యాలయాన్ని వైసీపీ వేరేచోటకు తరలించింది. స్థానిక శాసన సభ్యుడు కనీసం వ్యతిరేకించలేదు. స్థానిక, స్థానికేతర ప్రజాప్రతినిధులకు మధ్య ఉన్న తేడా అదే.

విశాఖలో కలపడం ఖాయం

మేం అధికారం చేపట్టిన వెంటనే శృంగవరపు కోట నియోజకవర్గాన్ని ఇక్కడి ప్రజల అభిమతం మేరకు విశాఖ జిల్లాలో కలిపేస్తాం. అధినేత నారా చంద్రబాబు దీనికి సమ్మతించారు.

తాటిపూడితో తాగునీరు

ఈ నియోజకవర్గ తాగునీటి అవసరాల కోసం తాటిపూడి పైలెట్ ప్రాజెక్టును టీడీపీ కేటాయించింది. 303 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని అంచనా రూపొందించాం. రెండు విడతలుగా రూ.75 కోట్లతో 99 గ్రామాలకు తాగు నీటి సరఫరా చేశాం. ఇంతలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత దీనిని పక్కన పెట్టేశారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తాటిపూడి నుంచి తాగునీరు అందుతుంది. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే శృంగవరపుకోట, జామి మండలాలకు తాటిపూడి ద్వారా... వేపాడ, కొత్తవలస, ఎల్.కోట మండలాలకు రైవాడ రిజర్వాయర్ నుంచి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉంది

రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఎన్నికలు ఇవి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను ధ్వంసం చేసింది. కక్ష సాధింపు చర్యలకు దిగింది. తిరిగి ఇదే పార్టీ గెలిస్తే సమాజానికి మరింత నష్టం జరుగుతుంది. చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నాయకుడు అధికారం చేపట్టేందుకు సైకిల్ గుర్తుపై ఓటేసి.. ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను గెలిపించాలని కోరుతున్నాను.

యువతే కీలకం

● జిల్లాలో 24,533 మంది కొత్తగా ఓటర్లు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మే 10: ఈ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థుల గెలుపు ఓటముల్లో యువత...అదీ కొత్త ఓటర్లు కీలక పాత్ర పోషించబోతున్నారు. మొట్టమొదటి ఓటు వినియోగించుకునేందుకు వీరంతా ఆసక్తి చూపుతున్నారు. ఎండైనా... వానైనా... ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వచ్చేది కూడా వీళ్లే . అందుకే ఈసారి ఎన్నికల్లో వీరి ఓటు కీలకంగా మారే అవకాశం ఉంది. నేతల రాతలను వీరే మార్చబోతున్నారు. ఓటంటే వజ్రాయుధం లాంటిది. ప్రజల జీవితాలను మార్చేది ఓటే. మంచి నాయకుడిని ఎన్నుకునేది కూడా వీరే. ఓటు వేసిన తరువాత ఓడ మల్లన్న అనే వారిని వీరు ఈసారి పక్కన పెట్టాలనుకుంటున్నారు. తాత్కాలిక ప్రయోజనాలు కాకుండా... అభివృద్ధి.. ఉద్యోగ-ఉపాధి అవకాశాలు ఎవరు కల్పిస్తారో..వారినే ఎన్నుకోవాలనే ఆలోచనతో యువత ఉన్నట్టు తెలుస్తోంది.



● జిల్లాలో మొత్తం ఓటర్లు 15,62,921 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం 18 నుంచి 40 ఏళ్ల లోపు వారే. వీరిలో కొత్త ఓటర్ల సంఖ్య 24,533. అత్యధికులు విద్యావంతులే. వీరంతా మంచి నేతలను ఎన్నుకోవాలనే తపనతో ఉన్నారు. మరి ఎవరికి పాలనా పగ్గాలు అందించాలనుకుంటున్నారో చూడాలి.

ఓటర్ల వివరాలు
(వయసుల వారీగా..)

వయస్సు	పురుషులు	మహిళలు
18-19	22,129	17,482
20-29	1,27,603	1,18,193
30-39	2,11,222	2,06,692
40-49	1,67,287	1,76,419
50-59	1,19,660	1,31,966
60-69	77,771	87,251
70-79	36,718	42,521
80-ఆపై	8,415	11,511
ఈ ఏడాది కొత్తగా నమోదు చేసుకున్న వారు :		24,533
ట్రాన్స్ జెండర్స్ :		83

పాచిపెంట.. అసెంబ్లీ నియోజకవర్గమే

● 1962లో ఒక్కసారే ఎన్నికలు

సాలూరు రూరల్, మే 10: పాచిపెంట అసెంబ్లీ సెగ్మెంట్ ఉండేదనే విషయం ఇప్పటి తరానికి తెలియదు. ఈ నియోజకవర్గం 1962లో ఉండేది. ఇది గిరిజనులకు రిజర్వ్ అయ్యింది. ఈ నియోజకవర్గంలో ఇప్పటి పాచిపెంట, మెంటాడ, దత్తిరాజేరులో కొన్ని గ్రామాలు ఉండేవని పెద్దలు చెబుతారు. ఈ నియోజకవర్గంలో 1962లో ఒక్కసారే అసెంబ్లీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి డిప్పల సూరిదొర, స్వతంత్ర పార్టీ నుంచి జన్ని ముత్యాలు (ప్రస్తుత కూటమి అభ్యర్థి సంధ్యారాణి తండ్రి) పోటీ పడ్డారు. ఈ స్థానంలో మొత్తం ఓట్లు 45,467 ఉండగా.. ఆ ఎన్నికల్లో 19,211 ఓట్లు పోలయ్యా యి. వాటిలో 17,998 ఓట్లు చెల్లాయి. మరో 1,213 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డిప్పల సూరి దొరకు 8,243 ఓట్లు రాగా, స్వతంత్ర పార్టీ అభ్యర్థి జన్ని ముత్యాలుకు 5,453 ఓట్లు వచ్చాయి. 2,790 ఓట్ల మెజార్టీతో డిప్పల సూరిదొర గెలుపొందారు. 1967 ఎన్నికల నాటికి ఈ నియోజకవర్గం రద్దయింది.



పాచిపెంట గ్రామం

మరికొన్ని నియోజకవర్గాలు

- గతంలో 1955, 1962లో బలిజిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఉండేది.
- 1967, 1972లో గొంప, పెదమానాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవి.
- పాచిపెంట మాదిరిగా 1962లో ఒక్కసారి రామతీర్థం (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం ఉండేది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జి.సూర్యనారాయణ 3,084 ఓట్ల మెజార్టీతో కె.ఆశన్నపై విజయం సాధించారు.
- 1955, 1962లో రేవిడి అసెంబ్లీ నియోజకవర్గం ఉండేది.
- 1952లో ఆలమండ నియోజకవర్గం ఉండేది.

ప్యాకేజీ వీరులు.. ఓట్లు లేని స్టార్లు



(విజయనగరం)

ఎన్నికలు వచ్చేయంటే చాలు. ప్యాకేజీ వీరుల సందడి అలా ఇలా ఉండదు. తమ చేతిలో వందలాది ఓట్లు ఉన్నాయని, తాము ఏ పార్టీకి చెబితే వారంతా ఆ పార్టీకే ఓట్లు వేస్తారని చెప్పి కొంతమంది చోటా మోటా నేతలు అభ్యర్థుల వద్ద నుంచి రూ.లక్షల్లో ప్యాకేజీలు తీసుకోవడం ఎన్నికల్లో పరిపాటిగా మారింది. వీరి ధాటికి గ్రామాల్లో కొద్దోగొప్పో ఓట్లు ఉన్న నేతలు జీరోలుగా మారిపోతున్నారు. ఓట్లులేని ప్యాకేజీ వీరులు మాత్రం తమ మాటలతో అహోఓహో అంటూ ప్రచారం ఆర్భాటంగా చేస్తున్నారు. ఇటువంటి వారికి ప్యాకేజీలు ఇవ్వకపోతే అభ్యర్థులు, పార్టీపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. అంతేకాక వీరు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. మరికొందరైతే ప్యాకేజీల కోసం పార్టీ మారుతారని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ప్రచారం ఆ నోటా ఈ నోటా పడి మండల స్థాయి నాయకుల ద్వారా అభ్యర్థుల దృష్టికి వెళ్తోంది. దీంతో తమ గెలుపు నకు ఎక్కడ ఇబ్బంది జరుగుతుందోనని భయంతో అభ్యర్థులు వారిని పిలిపించి బుజ్జగించి ప్యాకేజీలు ఇస్తున్నారు. ఓటర్లులేని నాయకులకు ప్యాకేజీలు ఇవ్వడంతో అవతల పార్టీ వారు ఎక్కడ విజయం సాధిస్తారోనని పలువురు గుసగుసలాడుతున్నారు. ఇది ఇరు పార్టీల్లో ఉండగా.. అధికార పార్టీలో అధికంగా కనిపిస్తోంది..

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శనివారం 11 మే 2024

మాటిచ్చి.. మరచిపోయారు!



గుంతలమయంగా మారిన చిలకాం రహదారి

- అధ్వాన రహదారులపై హామీలే తప్ప అమలు లేదు
- శపథం చేసినా..కార్యాచరణ లేదు
- కురుపాం ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తి

(గరుగుబిల్లి)

కురుపాం నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చిన ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి.. తరువాత వాటిని నెరవేర్చని పరిస్థితి నెలకొంది. కొబ్బరికాయలు కొట్టి రహదారి పనులు ప్రారంభిస్తామని మాటిచ్చి... మరిచిపోయారు. అధ్వాన రహదారులపై హామీలే తప్ప అమలు పరచని పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలో నెలకొంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన రహదారులే తప్ప వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తవి లేవు. కేవలం చిన్నపాటి మరమ్మతులకే పరిమితమయ్యారు తప్ప శాశ్వత రహదారుల నిర్మాణానికి చొరవ చూపకపోవడంతో ప్రజలు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని వివిధ గ్రామాల రహదారులకు నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఈ నిధులు వెనక్కి మళ్లాయి.

2018లో నాబార్డు, ప్రపంచ బ్యాంకు నిధులతో ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి సుంకి, పిట్టలమెట్ట, చిలకాం, కారివలస, మరుపెంట నుంచి సొంబన్నవలస, సన్యాసిరాజుపేట, గరుగుబిల్లి నుంచి బీవీ పురం, పెద్దూరు రహదారులకు ప్రతిపాదనలు చేశారు. నిధులు మంజూరైన సమయానికి ప్రభుత్వం మారడంతో రహదారులపై రాజకీయ కక్షలకు దిగారు. రహదారుల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టేందుకు తప్ప నిర్మాణాలకు చొరవ చూపలేదు. ప్రజలకు ఉపయోగపడని ప్రాంతంలో రహదారి ఏర్పాటుకు చొరవ చూపారని పలువురు విమర్శిస్తున్నారు.

కొంకడివరం నుంచి పెదగుడబ గ్రామానికి అనుసంధానం చేస్తూ ఉపాధి హామీ నిధులు సుమారు రూ. 2 కోట్లు మంజూరు చేయించి.. చినగుడబ ప్రాంతంలోని క్వారీ నిర్వాహకులకు లబ్ధి చేకూర్చారన్న విమర్శలు ఉన్నాయి. ప్రజలకు అవసరమైన రహదారి మార్గాలను మరచి క్వారీ అభివృద్ధికి రోడ్డు నిర్మించడంలో ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. గరుగుబిల్లి మండలం సబ్‌ప్లాన్‌లో లేనప్పటికీ ఐటీడీఏ ద్వారా ఈ పనులు చేయించారు. ప్రజా అవసరాలను మరిచి... సొంత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పదేళ్ల కాలంలో ప్రజా సమస్యలను విస్మరించారన్న ఆరోపణలు అధికంగా ఉన్నాయి.

ఓట్లు వేస్తేనే..

'మారుమూల గ్రామాలకు అవసరమైన రహదారులు ఏర్పాటు చేస్తాం. ఓట్లు వేస్తేనే రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతాం..' అని ఎమ్మెల్యే చెప్పారు. సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్ట రహదారి పనులకు రూ.5 కోట్లు మంజూరు చేయించారు. ఎన్నికల కోడ్‌కు ముందు రహదారికి శంకుస్థాపన చేశారు. పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తే సొంత నిధులతోనైనా రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

మాటల్లోనే అభివృద్ధి

ఎమ్మెల్యేగా ఎన్నికై పదేళ్లు కావస్తున్నా మాటల్లోనే అభివృద్ధి చేశారు తప్ప

సవాల్‌ను మరిచిన ఎమ్మెల్యే

మండలంలోని చిలకాం గ్రామానికి సంబంధించి సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలోనే శివ్వాం, కొత్తూరు, కొత్తపల్లి, గొట్టివలస, గదబవలసతో పాటు వివిధ గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజలకు అసౌకర్యంగా ఉండటంతో నాగూరు ఎంపీటీసీ సభ్యులు, అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సొంత నిధులతో గ్రావెల్‌ను వేసి రహదారిని చదును చేయించారు. రహదారి దుస్థితిని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా..రోడ్డు నిర్మించిన తరువాతనే గ్రామంలోకి వస్తానని శపథం చేశారు. ఈ శపథం నేటికీ నెరవేర్చలేదు. కొబ్బరికాయ కొట్టి వస్తానని చెప్పిన ఎమ్మెల్యే అన్న మాట మరచి ప్రచారానికి రావడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.



అధ్వానంగా పెద్దూరు - బీవీ పురం రోడ్డు

క్షేత్రస్థాయిలో సమస్యలు అలాగే ఉన్నాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం లప్పటి గ్రామానికి లుంబేసు నుంచి గత టీడీపీ హయాంలో రహదారి నిర్మించారు. ఆ సమయంలో ఈ ప్రాంతానికి బస్సు సర్వీసులను నిలుపుదల చేశారు. రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పలుమార్లు విన్నవించుకున్నా పరిష్కరించలేదు. చివరికి గిరిజనులు ఏకమై సొంతంగా పనులు చేసేందుకు ముందుకు వచ్చారు. 72 కుటుంబాలు రూ.వెయ్యి చొప్పున చందాలు వేసుకుని రహదారిని బాగు చేసుకున్నారు.

ఎన్నోసార్లు విన్నవించాం



చిలకాం రహదారిని అభివృద్ధి చేయాలని అనేకసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం. సమస్యలను పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. రహదారికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చి మరచిపోయారు. ఎన్నికల ప్రచారానికి గ్రామానికి వచ్చిన సమయంలో రహదారి విషయమై నిలదీశాం. ఓట్లు సమయంలోనే సమస్యలు నాయకులకు గుర్తు వస్తాయి. ఆ తరువాత మరిచిపోతారు. సమస్యలు పరిష్కరించని వారికి ఓట్లు ఎలా వేస్తాం.?

\- ఏగిరెడ్డి నారాయణరావు, చిలకాం, గరుగుబిల్లి మండలం


సమస్యలు చెబితే అవహేళన చేశారు



గ్రామాల్లోని సమస్యలు తెలియపరిస్తే ఎమ్మెల్యే అవహేళనగా మాట్లాడారు. ప్రజలను పనికిమాలిన వారిగా వర్ణించారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి తప్ప వ్యక్తిగతంగా దూషించడం మంచి పరిస్థితి కాదు. ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. నూతన ప్రభుత్వంలో రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడతాం. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరిచే బాధ్యత తీసుకుంటాం.

\- ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, గరుగుబిల్లి మండలం

'గిరి'నే ఓడించిన గిరిజన బిడ్డ



సారిక గ్రామం



సూరిదొర

సాలూరు: ఓ ఎన్నిక దేశంలో ఉన్న అనేక మంది మేధావులను ఆలోచింపజేసింది. ఓ గిరిజనుడిని హస్తినలో అడుగుపెట్టేలా చేసింది. సాక్షాత్తూ దేశ ప్రధానమంత్రినే మంత్రముగ్ధుడిని చేసింది. అదే 1957 లో జరిగిన పార్వతీపురం లోక్‌సభ ఎన్నిక. 1957 లో లోక్‌సభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఆ నోటిఫికేషన్‌లో పార్వతీపురం లోక్‌సభ స్థానానికి సంబంధించి ఒకరు రిజర్వుడు, మరొకరు జనరల్ స్థానానికి పోటీ చేయాల్సి ఉంది. రిజర్వుడు స్థానానికి బిడ్డిక సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ నుంచి కాడెద్దుల గుర్తుపై పోటీ చేయగా.. ప్రజా సోషలిస్ట్ పార్టీ నుంచి సాలూరు మండలంలోని మూకదొర తెగ కు చెందిన డిప్పల సూరిదొర పోటీ చేశారు. జనరల్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున వీవీ గిరి కాడెద్దుల గుర్తుపై పోటీ చేయగా.. ప్రజా సోషలిస్ట్ పార్టీ నుంచి చెట్టు గుర్తుపై వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు పోటీ చేశారు. బ్యాలెట్ పత్రాలను వారికి సంబంధించిన గుర్తు ఉన్న పెట్టెలో వేస్తే సరిపోతుంది. పోటీ చేసిన నలుగురిలో అందరికంటే ఎక్కువ ఓట్లు వచ్చిన వ్యక్తి మొదటి గెలిచిన వ్యక్తిగా, తరువాతి స్థానంలో ఓట్లు వచ్చిన వ్యక్తి రెండో గెలిచినట్లు వ్యక్తిగా చూపిస్తారు. అలా జరిగిన ఎన్నికలో జనరల్ స్థానానికి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడుపై వీవీ గిరి గెలుపొందారు. డిప్పల సూరిదొరపై బిడ్డిక సత్యనారాయణ గెలుపొందారు. ఎన్నికల కమిషన్ డిప్పల సూరిదొర కంటే ఎక్కువ ఓట్లు వచ్చిన బిడ్డిక సత్యనారాయణ గెలిచినట్టుగా ప్రకటించింది. అలాగే వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు కంటే ఎక్కువ ఓట్లు సాధించిన వీవీ గిరికి రిజర్వుడు స్థానానికి పోటీ చేసి ఓడిపోయిన డిప్పల సూరిదొర కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల కమిషన్ డిప్పల సూరిదొరను విజేతగా ప్రకటించింది. జనరల్ స్థానం నుంచి వీవీ గిరి గెలిచినప్పటికీ రిజర్వుడు స్థానంలో ఓడిన అభ్యర్థి కంటే తక్కువ ఓట్లు రావటంతో అప్పటి నిబంధనల మేరకు ఆయన్ను ఎన్నికల కమిషన్ ఓడిపోయినట్టుగా ప్రకటించింది.

ఢిల్లీకి పిలిపించుకున్న ప్రధానమంత్రి

దేశం గర్వించదగ్గ మేధావి, స్వాతంత్ర్య సమరయోధుడు వీవీ గిరిని ఓడించిన వ్యక్తిని తాను ఒక్కసారి చూడాలని.. తన వద్దకు తీసుకుని రావాలని అప్పట్లో కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న విశాఖపట్నం వాసి తెన్నేటి విశ్వనాథాన్ని ప్రధాని నెహ్రూ కోరారు. దీంతో సూరిదొరకు ఓ వ్యక్తిని తోడుగా ఇచ్చి విశాఖపట్నం నుంచి ఢిల్లీకి పంపించారు. సూరిదొర ఢిల్లీకి సమీపంలో ఉన్న ఆగ్రాకు చేరుకోగానే టీ తాగేందుకు కిందకు దిగారు. ఇంతలో రైలు కదలటంతో అక్కడే ఉండిపోయారు. దీంతో సూరిదొరతో వచ్చిన వ్యక్తి ఢిల్లీకి చేరుకుని మొత్తం విషయాన్ని నెహ్రూకు వివరించారు. హిందీ, ఇంగ్లీషు బాషలు రాని సూరిదొర రైల్వే స్టేషన్‌లో ఓ చోట కూర్చున్నారు. వెంటనే తెలుగులో అన్ని రైల్వే కేంద్రాల్లో వినిపించేలా ప్రకటన ఇవ్వాలని సంబంధిత అధికారులకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. అలా ఆగ్రా రైల్వే స్టేషన్‌లో ఆయనను గుర్తించిన రైల్వే అధికారులు వెంటనే ప్రధానమంత్రి వద్దకు తీసుకుని వెళ్లారు. ఎంపీగా గెలిచిన సూరిదొరను రైల్వే బోర్డు మెంబర్‌గా నియమించారు. ఎంపీగా పదవీ కాలం పూర్తయిన తర్వత పాచిపెంట సమితి అధ్యక్షుడుగా కూడా

ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

- నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా
- యువతకు వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా
- మీ ఆడపడుచుగా ఆశీర్వదించండి
- నెల్లిమర్ల కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి



నెల్లిమర్ల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి

(నెల్లిమర్ల)

'నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నియోజకవర్గ అభివృద్ధిపై ఎలాంటి శ్రద్ధ చూపలేదు. పేదల ఆర్థిక స్థాయి పెరగలేదు. తాగు, సాగు నీటి సదుపాయాలు పెద్దగా లేవు. నాకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే నెల్లిమర్ల నియోజకవర్గం రూపురేఖలు మారుస్తా. అభివృద్ధిలో నియోజకవర్గాన్ని పరుగులు తీయిస్తా' అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

తారకరామ తీర్థసాగర్ పూర్తి చేయిస్తా

డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన 24 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన తారకరామ తీర్థ సాగర్ రిజర్వాయర్ పనులు 15 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఈ పనులపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. ఈ ఎన్నికల్లో నేను గెలిస్తే చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ సహకారంతో రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాను. రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాను. ఈ రిజర్వాయర్ కోసం నెల్లి మర్ల మండలానికి చెందిన కోరాడపేట, ఏటీ అగ్రహారం, సారిపల్లి గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు తమ భూములను త్యాగం చేశారు. వారికి నష్ట పరిహారం పంపిణీ విషయంలో న్యాయం జరగలేదు. వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తా.

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా

నిరుద్యోగ యువత పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నాలుగు మండలాలకు చెందిన వేలాది మంది యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నేను గెలిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేసి సుమారు 30 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాను. నియోజక వర్గానికి పరిశ్రమలు తెప్పించి... పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తాను.

మత్స్యకారులకు జెట్టీ

జిల్లాలో మత్స్యకారులు ఉన్న ఏకైక నియోజకవర్గం నెల్లిమర్ల. వారి సమస్యల పరిష్కారానికి వైసీపీ తీసుకున్న చర్యలు శూన్యం. వారికి జెట్టీ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నేను గెలిస్తే మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాను. జెట్టీ నిర్మాణం, బట్టి కాలువ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. మత్స్యకార గ్రామాల్లో కిడ్నీ సమస్యలు ఉన్నాయి. దానికి ప్రత్యేక ఆసుపత్రి కట్టిస్తాను. మత్స్యకారుల అభివృద్ధి కోసం నిధులు తెస్తా.

స్కిల్ డెవెలప్‌మెంట్ సెంటర్‌ను స్థాపిస్తా

నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను స్థాపిస్తా. దీనిలో వివిధ కోర్సుల్లో యువతీ, యువకులు శిక్షణ పొంది నైపుణ్య అభివృద్ధిని సాధించడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చు, ఆర్థికంగా బలోపేతం కావచ్చు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశా. నేను గెలవగానే ఈ ప్రణాళికతో ముందుకు వెళ్తా. యువతీ యువకులే నా గెలుపులో కీలక పాత్ర పోషించాలి.

స్థానిక యువతకే ఉద్యోగావకాశాలు

స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఇక్కడి యువతకే ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతాను. ఫార్మా పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగవకాశాల కల్పన అంతంత మాత్రమే. ఫలితంగా వీరంతా ఉపాధి లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని నివారిస్తా. స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ నియామకాల నిబంధనలు మారుస్తా.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

నియోజక వర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ నేను పర్యటించాను. ప్రతి గ్రామంలోనూ వృద్ధులు, యువకులు, గ్రామ పెద్దలతో మాట్లాడాను. వారి సమస్యలు, గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాల కొరత ఉంది. ప్రధానంగా తాగునీరు సమస్య ఉంది. మురుగు నీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. అందువల్లనే ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. డెంకాడ మండలంలోని ఓ గ్రామంలో అధిక సంఖ్యలో కిడ్నీ బాధితులు ఉన్నారు. అంటే అక్కడ తాగునీరు కలుషితం అవడం గానీ, ఫ్లోరైడ్ సమస్య గానీ ఉందని స్పష్టమవుతోంది. నేను ఎమ్మెల్యేగా గెలవగానే ఆ గ్రామాన్ని సందర్శించి నీటి పరీక్షలు చేయిస్తా. కిడ్నీవ్యాధి, బోధకాలతో బాధపడే వారికి అవసరమైన మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తా.

ప్రజలందరికీ అందుబాటులో ఉంటా

నాకు డబ్బు సమస్య లేదు. డబ్బు సంపాదించాలని రాజకీయాల్లోకి రాలేదు. కేవలం ప్రజలకు సేవ చేయాలనే వచ్చా. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసే వాడే అసలైన నాయకుడు అని నా అభిప్రాయం. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరంతం ప్రజలకు అందుబాటులో ఉండి... వారి కష్టనష్టాల్లో భాగస్వామిని అవుతా.

మీ ఆడపడుచుగా ఆశీర్వదించండి

నా స్వగ్రామం నెల్లిమర్ల మండలం పెదబూరాడపేట. నన్ను ప్రజలందరూ ఆడపడుచుగా గుర్తించి... ఎమ్మెల్యేగా గెలిపించవలసిందిగా కోరుతున్నాను.



బొబ్బిలి: నాయుడుకాలనీలో మాజీ మంత్రి సుజయ్, తెంటు, మరిశర్ల తదితరులు



విజయనగరంలో కూటమి అభ్యర్థి అదితికి హారతి ఇస్తున్న దృశ్యం

కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఊరూరా తిరుగుతూ మేనిఫెస్టోపై అవగాహన కల్పించడంతో పాటు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్నారు. వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది.




గరుగుబిల్లి: గొట్టివలసలో అభివాదం చేస్తున్న కురుపాం కూటమి అభ్యర్థి జగదీశ్వరి



భోగాపురం: ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రతులను దహనం చేస్తున్న నెల్లిమర్ల కూటమి అభ్యర్థి నాగమాధవి, విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు



పాలకొండ: తంపటాపల్లిలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి జయకృష్ణ



బలిజిపేట: పార్వతీపురం కూటమి అభ్యర్థి విజయచంద్ర ప్రచారం



మక్కువ: ప్రచారం చేస్తున్న సాలూరు కూటమి అభ్యర్థి సంధ్యారాణి



రాజాం: డోలపేటలో కూటమి అభ్యర్థి కోండ్రు మురళి సతీమణి శ్రీలక్ష్మి ప్రచారం



చీపురుపల్లి: ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి కళా వెంకటరావు

పాలకొండ అభివృద్ధికి కృషి చేస్తా: జయకృష్ణ



సీతంపేట: పార్టీలో చేరినవారితో కూటమి అభ్యర్థి జయకృష్ణ

పాలకొండ: తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కోరారు. తంపటాల్లి గ్రామంలో సర్పంచ్ ప్రతినిధి జాడ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కొరికాన రవికుమార్, బలగ రమణరావు, ద్వారపూడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని కంబర, కంబరవలస, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కంబరవలస సర్పంచ్ ప్రతినిధి మరాడ సింహాచలంనాయుడుతో పాటు వంద కుటుంబాలు వైసీపీని వీడి జనసేనలో చేరాయి. అరకు పార్లమెంటరీ బీసీ సెల్ కన్వీనర్ కృష్ణమూర్తి నాయుడు, నాగేశ్వరరావు, గేదెల రమేష్‌నాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, కొరికాన రవికుమార్, ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు. ● **సీతంపేట:** పెద్దగూడ గ్రామంలో కూటమి జనసేన అసెంబ్లీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సవర సతీష్, సవర చిన్నారావు, సవర కవిత, సవర రామారావు, సవర రామారావు, తదితర 25 కుటుంబాలు జనసేనలో చేరారు. వీరికి జయకృష్ణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కూటమి నాయకులు సవర తోట ముఖలింగం, మండంగి విశ్వనాధం, ఆరిక అమల తదితరులు పాల్గొన్నారు. ● పాలకొండలోని నాలుగో వార్డు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు, జనసేన పరిశీలకులు కొరికాన రవికుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తేజోవతి, సిరిపురపు చూడామణి, బీజేపీ నాయకురాలు తాడంగి సునీత పాల్గొన్నారు. ● **భామిని:** రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పాలకొండ జనసేన పార్టీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్నారు. బాలేరు, సొలికిరి గ్రామాల్లో ఆయన శుక్రవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. జగదీష్, రవినాయుడు, సంజీవు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజలకు మేలు: జగదీశ్వరి



జియ్యమ్మవలస: అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి, వీరేష్

గరుగుబిల్లి: ప్రజలకు మేలు చేసేది టీడీపీయేనని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఉద్దవోలు, ఉల్లిభద్ర, మరుపెంట, గొట్టివలస, రావుపల్లి, నందివానివలసతో పాటు పలు గ్రామాల్లో ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఎ.మధుసూదన రావు, అంబటి తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం తదితరులు పాల్గొన్నారు. ● మరుపెంట లో 15 వైసీపీ కుటుంబాలు కూటమి అభ్యర్థి జగదీశ్వరి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థ పుచ్చుకున్నాయి. అలాగే గొల్లవానివలస నుంచి జనసేనలోకి 20 మంది చేరారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఎ.శంకరరావు, టీడీపీ నాయకులు కె.బలరాంనాయుడు, అక్కేన నారాయణరావు పాల్గొన్నారు. ● **జియ్యమ్మవలస:** చినమేరంగిలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు పర్యవేక్షణలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. అడుగడుగునా కూటమి అభ్యర్థి జగదీశ్వరిని ప్రజలు ఆశీర్వదించారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఆరేటి మహేష్, దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, కద్రక మల్లేష్, ఎన్.వంశీ, ఎంపీపీ బొంగు సురేష్ కుమర్ తదితరులు పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** స్థానిక గిరిజన బిడ్డనైన తనను ఆశీర్వదించాలని కురుపాం టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు కురుపాంలో గురువారం జరిగిన చంద్రబాబు సభను అందరూ కలిసి విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. తనను గెలిపిస్తే కురుపాం నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సమస్యల పరిష్కారానికి టీడీపీ రావాలి

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర



బలిజిపేట: ప్రచారంలో అభివాదం చేస్తున్న విజయచంద్ర

బలిజిపేట: గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని పలగర, రాయవలస, పదమాయవలస, అరసాడ, పనుకువలస, శివరాంపురం గ్రామాల్లో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పదమాయవలసలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి విజయచంద్ర పార్టీలోకి ఆహ్వానించారు. మండల నాయకులు వేణునాయుడు, మాజీ ఎంపీటీసీ గుర్ల సింహాచలంనాయుడు, మాజీ సర్పంచ్ మరిసర్ల చిన్న, క్లస్టర్ ఇన్‌చార్జి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. ● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** జిల్లా కేంద్రంలో టీడీపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, కోదాడ నారాయణరావుతో పాటు కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర సతీమణి బోనెల అనూష కొత్తవలస తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **పార్వతీపురం రూరల్:** కృష్ణపల్లిలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్రకు మద్దతుగా టీడీపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఏఎంసీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు గణేష్, విజయచంద్ర సతీమణి అనూష తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన నాయకుడిపై దాడి



పోలీసుస్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ పట్టణ నాయకులు

పార్వతీపురంటౌన్: ఇటీవల వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చిన ఒక నాయకుడిపై వలంటీర్, ఆమె భర్త దాడి చేశారు. బాధితుడు జి.శివకేశవరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 18వ వార్డు కోవెల వీధికి చెందిన వైసీపీ నాయకుడు జి.శివకేశవరావు ఇటీవల టీడీపీలో చేరారు. ఇదిలా ఉండగా, అదే వార్డులో నివాసం ఉంటున్న 19వ వార్డు వలంటీర్ మాధవిని వారం రోజుల కిందట ఎన్నికల నిబంధనల ఉల్లంఘన పేరిట అధికారులు విధుల నుంచి తొలగించారు. అయితే ఆ తొలగింపు శివకేశవరావు వల్లేనని భావించిన మాధవి, ఆమె భర్త వైసీపీ నాయకుడు కుమార్‌స్వామి గురువారం ఆయనపై దాడి చేశారు. రూ.4వేలు నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కోవడంతో పాటు నానా దుర్భాషలాడుతూ కొట్టడం అమానుషమని శివకేశవరావు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దాడి చేసిన వారిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాల్సిందే..

తమ నాయకుడుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాల్సిందేనని టీడీపీ పట్టణ నాయకులు ఎం.కృష్ణమోహన్, కె.నారాయణరావు, బి.కృష్ణ, జె.శ్రీదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ● దాడికి సంబంధించి సీఐ కృష్ణారావును వివరణ కోరగా.. ఇరుపక్షాలవారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, సమగ్ర దర్యాప్తు అనంతరం కేసు నమోదు చేస్తామని చెప్పారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేదల పాలిట శాపం

వీరఘట్టం: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం పేదల పలిట శాపంగా మారుతుందని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి అన్నారు. శుక్రవారం వీరఘట్టంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ రాక్షస పాలనను పారదోలాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లంచట్టం ఉమ్మడి ప్రభుత్వం రాగానే చంద్రబాబు రద్దు చేస్తారన్నారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి, నిమ్మక జయకృష్ణను, కమలం గుర్తుపై ఓటు వేసి కొత్తపల్లి గీతను గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సాసబిల్లి బుజ్జి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై బీఎల్వోలకు అవగాహన




ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బలిజిపేట: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్వోలకు ఎన్నికల నిర్వహణపై తహసీల్దార్ జవీ జనార్దన్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 67 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రతి గ్రామంలో ఎన్నికల నిర్వహణ బృందానికి ఎటువంటి ఆటంకం లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించండి

● విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

చీపురుపల్లి: ఎన్నికల సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ ముగిసేందుకు కృషి చేయాలని ఎస్పీ ఎం.దీపికా పాటిల్ ఆదేశించారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన నాలుగు మండలాల పోలీసు అధికారులు, సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. శాంతి భద్రతలకు భంగం కలిగే గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, సీఐ సీహెచ్ షణ్ముఖరావు, నాలుగు మండలాల ఎస్ఐలు కె.కిరణ్‌కుమార్ నాయుడు, దామోదరరావు, లోకేష్, భాస్కరరావు, నాలుగు మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వ సిద్ధం



మాట్లాడుతున్న ఆర్వో శాంతి

చీపురుపల్లి: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఆర్వో బి.శాంతి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని 257 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. 165వ నెంబరు స్టేషన్‌ను పింక్ పోలింగ్ స్టేషన్‌గా గుర్తించామని చెప్పారు. ఈ స్టేషన్‌లో అధికంగా మహిళా ఓటర్లు ఉంటారని, సిబ్బందిని కూడా మహిళల్నే నియమించామన్నారు. చీపురుపల్లి నియోజవర్గాన్ని 33 సెక్టార్లు, 33 రూట్లుగా విభజించారని తెలిపారు. రూట్ ఆఫీసర్లు, సెక్టోరియల్ అధికారుల్ని నియమించామన్నారు. 147 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామని ఆర్వో వివరించారు.

ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

● జిల్లా సబ్‌జైళ్ల శాఖాధికారి కృష్ణారావు



కృష్ణారావును సత్కరిస్తున్న దృశ్యం

పాలకొండ: పాలకొండ సబ్ జైలును జిల్లా సబ్ జైళ్ల శాఖాధికారి బి.కృష్ణారావు శుక్రవారం సందర్శించారు. జైలు పరిసరాలను పరిశీలించారు. ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వేసవి వేడి తగ్గించేందుకు అన్ని సబ్‌జైళ్లలో శ్లాబులపై కూల్ పెయింటింగ్స్ వేయించాలని, మట్టి కుండలు ఏర్పాటు చేయాలని సూచించారు. జైల్లో ఉన్న ఖైదీలను కలిసేందుకు వచ్చిన వారి బంధువులు గానీ కుటుంబ సభ్యులు గానీ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మార్పు చేసినట్టు తెలిపారు. ఈనెల 31న పదవీ విరమణ చేయనున్న జైళ్ల శాఖాధికారి కృష్ణారావుకు జైలు సూపరింటెండెంట్ జోగులు ఆధ్వర్యంలో సత్కరించారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జైళ్ల శాఖాధికారి సూచించారు. అంతకుముందు ఖైదీల సెల్స్, స్నానపు గదులు, వంట శాల, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌వార్డర్స్ పి.చంద్రరావు, బి.విజయకుమారి, పి.మధు, హేమసుందర్, నాగరాజు, సత్యారావు, నరసింహులు, రిప్పన్ శ్రీనివాసరావు, నాగరాజు, లక్షుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నర్సుల పాత్ర కీలకం



ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది

కురుపాం: ఆసుపత్రుల తోపాటు క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందించడంలో నర్సులు కీలక పాత్ర పోషిస్తున్నారని కురుపాం ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభరాణి అన్నారు. కురుపాం సీహెచ్‌సీలో హెడ్ నర్సు జి.ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ముందుగా శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రోగులకు పల్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ సుక్రిత, ఆసుపత్రిలో ఉన్న స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి విజయంతో వైసీపీ భూస్థాపితం

● సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి సంధ్యారాణి

మక్కువ: రాష్ట్రంలో కూటమి విజయంతో వైసీపీ భూస్థాపితం అవుతుందని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని డి.శిర్లం, దబ్బగడ్డ, నగుళ్ల, ఆనసభద్ర, దుగ్గేరు, చెముడు గ్రామాల్లో ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు సంధ్యారాణికి స్వాగతం పలికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి శూన్యమన్నారు. ఐటీడీఏ వ్యవస్థ ద్వారా వచ్చిన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. సైకో పాలన పోయి కూటమి పాలన రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఉపముఖ్యమంత్రి రాజన్నదొర సొంత మండలానికి ఏమి చేశారని ప్రశ్నించారు. ఒక్కసారి మీ ఆడపిల్లను గెలిపించి చూపిస్తే సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దుగ్గేరులో నిర్వహించిన సభలో జనం పోటెత్తారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు, సాలూరు నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి గేదెల రిషివర్ధన్, బి.గౌరీశంకర్, డాక్టర్ పి.మల్లేశ్వరరావు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

మండల కేంద్రాలకు చేరిన నోట్ పుస్తకాలు

గరుగుబిల్లి: రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించేందుకు అవసరమైన నోట్ పుస్తకాలు శుక్రవారం మండల కేంద్రాలకు చేరాయి. పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి. అయితే సంబంధిత ఉన్నతాధికారులు ముందస్తుగానే మండలాల వారీగా ప్రత్యేక వాహనంపై పుస్తకాలు తరలించి, మండల కేంద్రాల్లో భద్రపరుస్తున్నారు. పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉంది. ఎంఈవో-2 కె.కొండలరావు మాట్లాడుతూ మండలంలోని 56 పాఠశాలలకు 22,402 నోట్ పుస్తకాలు కేటాయించారని చెప్పారు. పాఠశాలల పునఃప్రారంభం తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు పంపిణీ చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీటిని భద్రపరుస్తున్నామని ఆయన చెప్పారు.

చినుకు పడితే చీకటే..

● భామినిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



అంధకారంలో ఉన్న భామిని గ్రామం

భామిని: మారుమూల మండలమైన భామినిలో చినుకుపడితే చీకట్లో ఇబ్బందులు తప్పడంలేదు. గత నాలుగు రోజులుగా సాయంత్రం ఈదురు గాలులతో చిరుజల్లులు కురవడంతో రాత్రిపూట విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి చిరుజల్లులు కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. దీంతో చీకట్లోనే చార్జింగ్ లైట్లులోనే మెసులుతున్నారు. మహిళలు వంట చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.

సీతంపేటలో భారీ వర్షం



సీతంపేటలో వర్షం కురుస్తున్న దృశ్యం

సీతంపేట: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడం, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో ఈ వర్షం ఎంతగానో ఉపశమనం ఇచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి ఉపాధి శిక్షణ శాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది శిక్షణ పొందేందుకు కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా), మెకానిక్ డిజల్ రెండేళ్ల శిక్షణ పొందేందుకు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడుల్లో ఖాళీలను భర్తీ చేయడానికి జూన్ లోపు ఆసక్తిగల వారు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అనంతరం ఒరిజినల్ ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

బొబ్బిలి: ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల కోసం గ్రీన్‌బెల్ట్ సొసైటీ, యూటీఎఫ్, మాజీ సైనికోద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 15 రోజుల ఉచిత వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూళ్లకు చెందిన తొమ్మిదోతరగతి పాసైన 120 మంది విద్యార్థులకు స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులపై నిపుణులతో శిక్షణ ఇచ్చారు.

స్థానిక వనరులను వినియోగించుకోండి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రీజనల్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణారావు

గరుగుబిల్లి: స్థానిక వనరులతో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వి.కృష్ణారావు సూచించారు. శుక్రవారం తోటపల్లిలో జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో మన్యం జిల్లాలోని 15 మండలాలకు చెందిన ప్రకృతి సిబ్బందికి పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షిస్తూ, పెట్టుబడులు తగ్గించి, దిగుబడులు అధికంగా వచ్చే వాటిపై దృష్టి సారించాలన్నారు. ఖరీఫ్ నుంచి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు ఎకరాకు 10 నుంచి 15 కిలోల నవధాన్యాలను వేసుకొని భూమిని సారవంతం చేసుకునేందుకు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, జిల్లా రిసోర్స్‌పర్సన్ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో పోలీసు కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సీతానగరం: మండలంలోని బూర్జ, నిడగల్లు, సీతానగరం సమస్యాత్మక గ్రామాల్లో శుక్రవారం హర్యానా పోలీస్ సిబ్బందితో స్థానిక పోలీసులు ర్యాలీ నిర్వహించారు. శాంతిభద్రతలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించండి

● విజయనగరం డీఎంహెచ్‌వో భాస్కరరావు



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

బొండపల్లి: వడదెబ్బపై వైద్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. దేవుపల్లి గ్రామంలోగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల పట్ల ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, వడదెబ్బకు గురైన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన పౌష్టికాహారంతోపాటు నెలవారీ టీకాలు, వైద్య పరీక్షలు అన్ని సక్రమంగా అందించేలా చూడాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో హైరిస్కు లేని గర్భిణులు అందరూ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి బి.సత్యవతి, ఎంపీహెచ్‌ఈవో అప్పలనాయుడు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో అక్షయ తృతీయ పూజలు



చందనంతో పారమ్మతల్లి

సాలూరు రూరల్: అక్షయ తృతీయ సందర్భంగా ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాలూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి, జ్ఞానసరస్వతి, సంతోషిమాత, కామాక్షి తదితర ఆలయాల్లో పూజలు చేశారు. ● ఉత్తరాంధ్ర ఇలవేల్పు పారమ్మకొండ వద్ద ఉన్న పారమ్మ తల్లికి శుక్రవారం సనాతన ధర్మపరిషత్ వ్యవస్థాపకుడు సుబ్బ గురువు ఆధ్వర్యంలో చందనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. లలిత పారాయణం నిర్వహించారు.

'సీపీఎం అభ్యర్థులను గెలిపించుకోవాలి'

కురుపాం: ఇండియా కూటమి బలపరిచిన కురుపాం నియోజకవర్గం సీపీఎం అభ్యర్థి మండంగి రమణ, అరకు పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించుకోవాలని మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ కోరారు. శుక్రవారం కురుపాంలో అభ్యర్థులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా తన మద్దతు సీపీఎం అభ్యర్థులకు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.